క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



చల్లపల్లి: వైఎస్సార్ బీమా పథకం పేదలకు భరోసాగా నిలుస్తోందని చల్లపల్లి ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని) అన్నారు. చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీకి చెందిన మార్గాని ధనలక్ష్మి ఈ నెల 25న మృతిచెందింది. మంగళవారం ఆమె కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష బీమా పరిహారం మంజూరైంది. తక్షణ సాయంగా రూ.10 వేలను చల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మృతురాలి తల్లి మోతుకూరి వెంకటేశ్వరమ్మకు అందజేశారు. పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, వార్డు సభ్యురాలు మరీదు భవాని, గ్రామ సచివాలయం-3 వెల్ఫేర్ అసిస్టెంట్ అవనిగడ్డ రేణుక తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి

కోడూరు: కోడూరు షిర్డీ సాయి దివ్య ధ్యాన జ్ఞాన మందిరంలో దత్తాత్రేయ స్వామివారి జయంతిని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో స్వామి వారి మూలమూర్తికి ప్రత్యేక పూజలు జరిగాయి. నవవిధ అభిషేకాలు చేసి, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. కోడూరు సోమేశ్వరస్వామి వారి ఆలయంలోని దత్తాత్రేయుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్య వైశ్య మహిళలు శ్రీదత్తాత్రేయ అష్టోత్తర శత నామాన్ని పఠించారు. అనంతరం లింగాకారుడికి వివిధ రకాల అభిషేకాలను నిర్వహించారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి తూర్పు రామాలయం వద్ద సత్యనారాయణ స్వామి వారి సామూహిక వ్రతాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీటీడీ మండల ధర్మా చార్యులు గరికిపాటి వీరాంజనేయులు నేతృత్వంలో 108 మంది దంపతులచే వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య సత్యనారాయణ సామూహిక వ్రతం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీటీడీ కృష్ణా జిల్లా కో-ఆర్డినేటర్ సీవీకే ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు జి. వెంకటేశ్వరరావు, శివరావు, లింగం బసవశంకరరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై అవగాహన



కొక్కిలిగడ్డ(మోపిదేవి): పెదప్రోలు, కప్తానుపాలెం, కొక్కిలిగడ్డ, కొత్తపాలెం గ్రామాల్లో మంగళవారం ఓటర్లకు నమూనా పోలింగ్ నిర్వహించారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌ల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాలిమెట్ల ఏసుబాబు, దిడ్ల జానకీ రాంబాబు, జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, వీఆర్వోలు రమాదేవి, నీల్‌కాంత్, దుర్గ గణేష్, ఓటర్లు పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడి పూజోత్సవాలు ప్రారంభం

కోడూరు: కోడూరు అయ్యప్పస్వామివారి ఆలయంలో మహా పడి పూజోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి వేద పండితుల మంత్రోశ్చరణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోడూరుకు చెందిన బూరగడ్డ వంశీయులు ఉత్సవాలకు ఉభయదాతలుగా వ్యవహరించారు. మంగళవారం అయ్యప్ప మూలమూర్తికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని మణికంఠుడిగా అలంకరించి ఊరేగించారు. బుధవారం ఉదయం కేరళ తరహాలో అయ్యప్ప ఉత్సవమూర్తికి లక్ష రూపాయి నాణేలతో అభిషేకం చేస్తామని ఆలయ కమిటీ తెలిపింది. భక్తులే నాణేలతో స్వామివారిని అభిషేకించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. రాత్రికి మహా పడి పూజోత్సవం ఉంటుందని వివరించారు.

లక్ష్మీనారాయణస్వామి సేవలో సినీ కవి జొన్నవిత్తుల



అవనిగడ్డ: ప్రసిద్ధి చారిత్రాత్మక లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని సినీ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మంగళవారం దర్శించుకున్నారు. ప్రముఖ ఆలయాల సందర్శనలో భాగంగా లక్ష్మీనారాయణస్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చారిత్రక విషయాలను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ఎంతో చారిత్రక నేపథ్యమున్న లక్ష్మీనారాయణస్వామి ఆలయాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆయనతోపాటు ప్రముఖ కవి శ్యామలానంద ప్రసాద్ స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్రా

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- అట్టహాసంగా క్రీడా పోటీలు ప్రారంభం
- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు



చల్లపల్లిలో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



నాగాయలంకలో కబడ్డీ ఆడుతున్న గ్రామ వలంటీర్లు



నాగాయలంకలో కబడ్డీ ఆడుతున్న గ్రామీణ క్రీడాకారులు



కోడూరులో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ



బంటుమిల్లిలో పోటీలను ప్రారంభిస్తున్న జోగి రాజీవ్, సర్పంచ్ కృష్ణవేణి



పులిగడ్డలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, ఆర్డీఓ వాణి



బందరులో క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ

చల్లపల్లి: గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక ఎస్సార్‌వై ఎస్సీ హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రారంభించి కొద్దిసేపు షటిల్ ఆడారు. యువత, బాలలు, క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభతో ఎదగాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి నేపథ్యంలో గ్రామాల్లో ఆహ్లాదకరమైన క్రీడల వైపు మళ్లించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడా పోటీలు ఏర్పాటు చేశారని వివరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ, జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ నజరానా, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ గంజి శ్రీనివాసరావు, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, ఎంఈఓ జీఎస్‌బీ గోపాల్, ఎంపీటీసీలు మోపిదేవి ద్వారకానాథ్, నూకల వెంకటేశ్వరరావు, సర్పంచ్ తోట శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

● **మోపిదేవి:** క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మోపిదేవి గురుకుల పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. వయస్సుతో సంబంధం లేకుండా పౌరులందరికీ ఆనందం కల్పించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది క్రీడా పోటీలను నిర్వహిస్తోందని చెప్పారు. ఆహ్లాదకర వాతావరణంలో క్రీడలను కొనసాగించాలని సూచించారు. తొలుత జాతీయ జెండాను ఎమ్మెల్యే సింహాద్రి, క్రీడా జెండాను గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి ఆవిష్కరించారు. ఖోఖో, కబడ్డీ పోటీలను ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు ప్రారంభించారు. తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు, మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి గోవిందరాజులు, మోపిదేవిలంక సర్పంచ్ మోర్ల జ్యోత్స్న, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు పార్టీ పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.

● **నాగాయలంక:** నాగాయలంక జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కబడ్డీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడా ఆణిముత్యాలను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌ను 40 రోజుల పాటు వివిధ స్థాయిల్లో నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో నాలుగు జోన్లుగా గ్రామ స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నామని, కబడ్డి క్రీడాకారులు 504 మంది 42 జట్లుగా పోటీల్లో పాల్గొంటున్నారని, వీటిలో 20 మహిళా క్రీడా జట్లు ఉన్నాయని వివరించారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, భోగాది శేషగిరిరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎంవీ సాంబశివరావు, తోట సాయిబాబు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

● **కోడూరు:** కోడూరు జెడ్పీ పాఠశాల క్రీడాప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి మంగళవారం ప్రారంభించారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను పురుషులు, మహిళల విభాగాల్లో వేర్వేరుగా నిర్వహించారు. కోడూరు-1,2,3, ఉల్లిపాలెం సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు కోడూరు జెడ్పీ క్రీడాప్రాంగణంలో, మండపాకల, లింగారెడ్డిపాలెం, రామకృష్ణాపురం సచివాలయాల క్రీడాకారులకు లింగారెడ్డిపాలెం జెడ్పీ క్రీడా ప్రాంగణంలో, విశ్వనాథపల్లి, వి.కొత్తపాలెం, సాలెంపాలెం, పిట్టల్లంక సచివాలయాల క్రీడాకారులకు వి.కొత్తపాలెం జెడ్పీ క్రీడాప్రాంగణంలో ఆటల పోటీలను నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, కోట పద్మావతి వరప్రసాద్, ఉప సర్పంచి ఇంకొల్లు మురళీకృష్ణ, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● **కృత్తివెన్ను:** కృత్తివెన్నులో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజులు ప్రారంభించారు. వాలీ బాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాట్మింటన్ విభాగాలలో పోటీలు జరుగుతున్నాయని అధికారులు వివరించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, ఎస్ఐ గణేష్‌కుమార్, పాఠశాలల ఉపాధ్యాయులు, నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

● **అవనిగడ్డ:** పులిగడ్డ గురుకుల పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఆర్డీఓ వాణి ప్రారంభించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తం జరుగుతున్న ఈ కార్యక్రమం దేశంలోనే సరికొత్త రికార్డు నెలకొల్పనుందని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, సర్పంచ్ దాసరి విజయకుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, గాజుల జయగోపాల్, షేక్‌నజీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

● **చిలకలపూడి(మచిలీపట్నం):** యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. స్థానిక సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, శీలం బాబ్జీ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గాడెల్లి డేవిడ్ శామ్యూల్, కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ, మునిసిపల్ కమిషనర్ జి.చంద్రయ్య, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఘంటసాలలో..

● **అవనిగడ్డ:** ఘంటసాల జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రారంభించారు. గెలుపే లక్ష్యంగా క్రీడల్లో రాణించి రాష్ట్ర, జిల్లా స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, ఎంపీడీఓ టి. అనూహ్య, తహసీల్దార్ బి. రామానాయక్, ఎస్ఐ శ్రీనివాస్, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● **పెడన:** క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రాలో క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మంగళవారం పట్టణంలోని పల్లోటి హైస్కూల్‌లో వాలీబాల్ పోటీలను కటకం నాగకుమారి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కటకం ప్రసాద్, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు. మండలంలోని నందమూరు, నందిగామ, చెన్నూరు, చేవేంద్ర, పెనుమల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఆటల పోటీలను ప్రారంభించారు.

● **బంటుమిల్లి:** పెదతుమ్మిడి, మల్లపరాజుగూడెం గ్రామాల్లో పోటీలను ఎంపీపీ వెలివెల చినబాబు ప్రారంభించగా, బంటుమిల్లిలో మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, సర్పంచి కృష్ణవేణితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఎంపీడీఓ జె.స్వర్ణభారతి, ఎంఈఓలు బాలాత్రిపుర సుందరీదేవి, వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్.మహేష్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి వీఎం రంగా



నాగాయలంకలో రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రమేష్‌బాబు, కాపు నేతలు



మల్లవోలులో నివాళులర్పించి మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్



బందరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పేర్ని కిట్టు, నాయకులు

పెడన: పేదల పెన్నిధి వీఎం రంగా అని మంత్రి జోగి రమేష్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రంగా చిత్రపటానికి మంత్రి జోగి రమేష్, నాయకులు నివాళులు అర్పించారు. మంత్రి మాట్లాడుతూ రంగా సేవలను కొనియాడారు. పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు గరికిపాటి రామానాయుడు, బండారు మల్లి, అయూబ్ ఖాన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మండల పరిధిలోని ఉరివి, చెన్నూరు గ్రామాలలో పాటు పట్టణంలోని 9వ వార్డులో రంగా విగ్రహాలకు మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు అచ్యుతరావు, కొండవీటి నాగబాబు తదితరులు పాల్గొన్నారు. చేవేంద్ర గ్రామంలోని రంగా విగ్రహానికి రాధా-రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో కూనపరెడ్డి వెంకటేశ్వరరావు, ఆదివిష్ణు, సుబ్బారావు, వెంకటేష్ రంగయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **అవనిగడ్డ:** అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రంగా చిత్రపటానికి ఎమ్మెల్యే సింహాద్రి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, పులిగడ్డ పిచ్చేశ్వరరావు, జయగోపాల్ పాల్గొన్నారు.

నాగాయలంకలో రంగా విగ్రహావిష్కరణ

నాగాయలంక: అందరివాడు వీఎం రంగా అని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మండల కనకదుర్గ కృష్ణదేవరాయ కాపు సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నాగాయలంకలో ఏర్పాటు చేసిన రంగా విగ్రహాన్ని ఆయన కాపు నేతలతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. కాపు సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్ సారథ్యంలో కమిటీ సభ్యులు, పెద్దల సహకారంతో విగ్రహం ఏర్పాటుకు కృషి చేసిన ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్యే సింహాద్రి అభినందించారు. మెండు లక్ష్మణరావు, మండలి వెంకట్రామ్, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, కాపు పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు, రాధారంగా మిత్రమండలి నేతలు పాల్గొన్నారు. తొలుత భారీ ర్యాలీ నిర్వహించారు.

● **గూడూరు:** బడుగు, బలహీన వర్గాల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు వంగవీటి మోహన రంగా అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మల్లవోలులోని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సురేష్ రంగబాబు, తలుపుల వెంకట కృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.

● **కృత్తివెన్ను:** లక్ష్మీపురం రంగా సెంటర్‌లోని రంగా విగ్రహానికి మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో రంగా వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి.

● **కోడూరు:** కోడూరు ప్రధాన సెంటర్‌లో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, మండల కన్వీనర్ మాధవరావు, కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, కడవకొల్లు శ్రీనివాసరావు పాల్గొన్నారు. మాచవరంలో పార్టీ శ్రేణులు రంగా చిత్రపటానికి నివాళులర్పించారు. ఉల్లిపాలెంలో వర్ధంతి నిర్వహించారు.

● **చల్లపల్లి:** స్థానిక పడమర వైపు రంగా విగ్రహానికి ఎమ్మెల్యే సింహాద్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు, పాగోలు సర్పంచ్ తోట శ్రీనివాసరావు, యడ్ల జగదీష్, రాధా రంగా మిత్రమండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

● **కోసూరువారిపాలెం(మోపిదేవి):** కోసూరువారిపాలెంలో సచివాలయ మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు ఆధ్వర్యంలో, కె. కొత్తపాలెంలో మాజీ సర్పంచ్ చందన సుబ్బారావు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను నాయకులు కొనియాడారు. ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, రజనీకాంత్, బచ్చు దిలీప్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● **చిలకలపూడి(మచిలీపట్నం):** మహోన్నత వ్యక్తి రంగా అని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) అన్నారు. నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, షేక్ సలార్ దాదా, శీలం బాబ్జి, మాడపాటి విజయలక్ష్మి, గాడెల్లి డేవిడ్ శామ్యూల్, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు. రేవతి సెంటర్‌లోని రంగా విగ్రహానికి ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ నివాళులర్పించారు.

● **కోనేరుసెంటర్:** అన్ని వర్గాలకు ఆరాధ్య దైవం వంగవీటి మోహనరంగా అని ఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు తెలిపారు. పార్టీ కార్యాలయంలో రంగా చిత్రపటానికి కిట్టు, నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. మార్కెట్ యార్డు చైర్మన్ గాడెల్లి డేవిడ్, వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకుడు షేక్ సిలార్ దాదా, బూరగడ్డ రమేష్‌నాయుడు, పార్టీ నియోజకవర్గ కన్వీనర్లు చిటికిన నాగేశ్వరరావు, మారుతీరావు, మేకల సుబ్బన్న, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

● **బంటుమిల్లి:** లక్ష్మీపురం సెంటర్‌లో రంగా చిత్రపటానికి మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సాయం అందజేత

అవనిగడ్డ: జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు అర్హత సాధించిన నాగాయలంక జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కొక్కిలిగడ్డ విన్నీనాయుడుకు శ్రీరా మా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ శ్యాంకిశోర్‌నాయుడు రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. సొసైటీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో విన్నీనాయుడిని ఘనంగా సత్కరించారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

వక్కలగడ్డ(చల్లపల్లి): కష్టజీవుల పక్షాన సీపీఐ సుదీర్ఘ కాలంగా అనేక పోరాటాలు సాగిస్తోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక పీఏసీఎస్ ఎదుట సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాయకులు మల్లుపెద్ది బోసు, రత్నకుమారి, అట్లూరి వెంకటేశ్వరరావు, అజయ్, లెనిన్, సాయి బాబు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

కృత్తివెన్ను: గత ఐదురోజులుగా కృత్తివెన్నులోని ఆంజనేయస్వామి వారి దేవస్థానం వద్ద జరుగుతున్న ఆంజనేయస్వామివారి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారి ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి స్వామివారి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది.

గజ వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామివారి దేవస్థాన వార్షికోత్సవాల సందర్భంగా మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) మేనేజింగ్ డైరెక్టర్, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం స్వామివారు గజ వాహనంపై వీధుల్లో విహరించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. గ్రామ మాజీ సర్పంచి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పైడమ్మ సంబరాలు ప్రారంభం

పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మ వారు ఈనెల 17న రంగుల అలంకరణ నిమిత్తం ఊరేగింపుగా మచిలీపట్నం వెళ్లారు. చల్లరాస్తా సెంటర్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో రంగుల అలంకరణ పూర్తి చేసుకున్న అమ్మవారిని మంగళవారం ఉదయం ఆలయ ఈఓ తిక్కిశెట్టి మోహనరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు వాయునందనరావు, ఆసాది శ్యాం తదితరులు అమ్మ వారిని తీసుకువచ్చేందుకు వెళ్లారు. మచిలీపట్నం వీధులలో అమ్మ వారు తిరుగుతూ మంగళవారం రాత్రికి పెడన చేరుకున్నారు. అత్తింటివారైన దాసు, వంశీయులు పుట్టింటివారైన తోట వంశీయులు అమ్మ వారికి నైవేద్యాలు సమర్పించి పూజలు చేసి మంగళ హారతులు ఇచ్చారు. బుధవారం ఉదయం అమ్మ వారు కొత్తపేటలోని పైడమ్మ ఆలయంలోకి ప్రవేశించనున్నారని ఈఓ మోహనరావు తెలిపారు.